క్లుప్తంగా

వైభవంగా కోటి దీపోత్సవం



మైలవరం: షిర్డీ సాయిబాబా భక్త సమాజం ఆధ్వర్యంలో మైలవరంలో కోటి దీపోత్సవం గురువారం కనుల పండువగా జరిగింది. మైలవరంలోని షిర్డీ సాయి బాబా దేవాలయం ఎదురుగా ఉన్న ఖాళీ ప్రదేశంలో జరిగిన కోటి దీపోత్సవానికి ముఖ్య అతిథిగా ద్వారకా తిరుమల దేవస్థానాల వంశపారంపర్య ధర్మకర్త, మైలవరం జమీందారు తనయుడు ఎస్వీ నివృతరావు హాజరయ్యారు. వేద పండితుల మంత్రోచ్ఛరణలతో కార్యక్రమం వైభవంగా జరిగింది. పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొని పూజలు చేశారు.

అన్నదానానికి రూ. లక్ష విరాళం

నెమలి(గంపలగూడెం): నెమలి వేణుగోపాలస్వామి దేవస్థానం నిత్యాన్నదానానికి భక్తులు గురువారం రూ. లక్ష విరాళాన్ని అందజేశారు. తెలంగాణ రాష్ట్రం ఖమ్మం జిల్లా బోనకల్ మండలం నారాయణపురం గ్రామానికి చెందిన దివంగత కొలిపాక వెంకటరామ నరసింహారావు, రంగ నాయకమ్మల జ్ఞాపకార్థం వారి కుమార్తె ఊటుకూరు విజయలక్ష్మి ఈ మొత్తాన్ని ఆలయ సిబ్బందికి అందజేశారు. దాతను ప్రధాన అర్చకులు తిరునగరి గోపాలాచార్యులు ఆశీర్వదించి ప్రసాదం అందజేశారు.

టీబీని నివారించవచ్చు



కొటికలపూడి(ఇబ్రహీంపట్నం): అప్రమత్తతతో జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా క్షయ వ్యాధిని పూర్తిగా నివారించవచ్చని ఇబ్రహీంపట్నం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సయ్యద్ పర్వీన్ అన్నారు. కొటికలపూడిలో టీబీ వ్యాధి నివారణపై ప్రజలకు అవగాహన సదస్సు గురువారం నిర్వహించారు. అంటువ్యాధిగా ఉన్న టీబీ గాలి ద్వారా ఒకరి నుంచి మరొకరికి వ్యాపిస్తుందని చెప్పారు. ఆరు నెలలు మందుల వాడకంతో క్షయ వ్యాధి పూర్తిగా నయం చేయవచ్చని చెప్పారు. ఆరోగ్య కార్యకర్తలు ఇంటింటి సర్వేతో వ్యాధి లక్షణాలు ఉన్న వారిని గుర్తించాలని డబ్ల్యూహెచ్‌ఓ కన్సల్టెంట్ డాక్టర్ జయసాయి తెలిపారు.

యాదవులు సంఘటితం కావాలి

ఊటుకూరు(గంపలగూడెం): సమస్యల పరిష్కారానికి యాదవులంతా సంఘటితం కావాల్సి ఉందని తెలంగాణ రాష్ట్ర యాదవ సంఘం అధ్యక్షుడు కూరాకుల నాగభూషణం యాదవ్ అన్నారు. గంపలగూడెం మండలం ఊటుకూరులో యాదవ సంఘం ఆధ్వర్యంలో గురువారం వన సమారాధన నిర్వహించారు. మధ్యాహ్నం సహపంక్తి భోజనాలు చేశారు.

1న బాస్కెట్ బాల్ జట్ల ఎంపిక

నూజివీడు: ఉమ్మడి కృష్ణా జిల్లా సీనియర్ పురుషులు, మహిళల బాస్కెట్‌బాల్ జట్లను పట్టణంలోని డీఏఆర్ కళాశాల ఆవరణలో డిసెంబర్ ఒకటో తేదీ నుంచి ఎంపిక చేయనున్నట్లు అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు జీఎస్‌సీ బోస్, డి.సత్యనారాయణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపిక చేసిన జట్లు డిసెంబర్ 7 నుంచి పది వరకు పశ్చిమ గోదావరి జిల్లా మార్టేరులో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనాలన్నారు. క్రీడాకారులు ఆధార్ కార్డు తీసుకుని రావాలన్నారు.

పరిశుభ్రత పాటించాలి

చంద్రాల(మైలవరం): ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని ప్రధానోపాధ్యాయులు వరద శ్రీనివాసరావు అన్నారు. మైలవరం మండలం చంద్రాల గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రపంచ హ్యాండ్స్ వాషింగ్ డేను గురువారం నిర్వహించారు. హెచ్‌ఎం మాట్లాడుతూ భోజనానికి ముందు, భోజనం చేసిన తరువాత చేతులను నీటితో కడిగి పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తే వ్యాధులు దరిచేరవని చెప్పారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. మైలవరంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో హ్యాండ్ వాషింగ్ డేను ఘనంగా నిర్వహించారు.

తల్లిదండ్రుల చెంతకు బాలిక

గంపలగూడెం: 15 నెలల కిందట ఇంటి నుంచి వెళ్లిపోయిన బాలిక ఆచూకీ లభించింది. ఎస్‌ఐ ఎస్. శ్రీను తెలిపిన వివరాల ప్రకారం.. గంపలగూడెంకు చెందిన 17 సంవత్సరాల బాలిక నెమలిలో ఆమె పిన్ని ఇంటి వద్ద కొంతకాలంగా ఉంటోంది. అక్కడి నుంచి తోటమూలలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ చదివేందుకు రాకపోకలు సాగించేది. ఈ నేపథ్యంలో బాలిక తల్లిదండ్రులు పనిచేయడం లేదని మందలించారన్న నెపంతో 2023 ఆగస్టు 29న ఇంటి నుంచి వెళ్లిపోయి తిరిగిరాలేదు. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు 2023 ఆగస్టు 31న గంపలగూడెం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదుచేసి విచారణ చేపట్టారు. ఆ బాలిక విజయవాడలోని ఒక హోటల్‌లో పని చేస్తున్నట్లు అందిన సమాచారం మేరకు పోలీసులు వెళ్లి బాలికను గుర్తించి తీసుకొచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు.

నిందితుల అరెస్టు

మైలవరం: మైలవరం నియోజకవర్గం జి.కొండూరు మండలం చెరువు మాధవరం గ్రామంలో అనధికారికంగా మద్యం అమ్ముతున్న గ్రామానికి చెందిన వేముల రమణను గురువారం అరెస్టు చేశారు. రెడ్డిగూడెం మండలం ఓబులాపురం గ్రామంలో వేముల మూసయ్య నుంచి ఆరు లీటర్ల సారా, పరికెల కోటేశ్వరరావు నుంచి రెండు లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేశారు.

అస్తవ్యస్తంగా డ్రెయినేజీ వ్యవస్థ



ఇటీవల కురిసిన వర్షాలకు నిలిచిన నీటితో చెరువును తలపిస్తున్న తిరువూరు ఫ్యాక్టరీ సెంటర్ (ఫైల్)



తిరువూరు 6వ వార్డులో డ్రెయినేజీ లేకుండా నిర్మించిన సీసీ రోడ్డు

- తిరువూరు పట్టణంలో నిత్యం సమస్యే
- కాగితాలకే పరిమితమైన పక్కా డ్రెయిన్లు
- వర్షాకాలంలో జలమయమవుతున్న లోతట్టు ప్రాంతాలు

తిరువూరు: పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా తిరువూరు పట్టణంలో మురుగునీటి పారుదలకు తగిన ఏర్పాట్లు చేయలేదు. రెండు దశాబ్దాల కిందట మెయిన్‌రోడ్డులో, రామాలయం రోడ్డులో నిర్మించిన డ్రెయినేజీలు మినహా ఇతర ప్రాంతాల్లో మురుగునీరు, వర్షంనీరు పోయేందుకు డ్రెయిన్లు నిర్మించకపోవడంతో లోతట్టు ప్రాంతాలు జలమయమవుతున్నాయి. రోడ్లపై వర్షం నీరు నిలిచి చెరువులను తలపిస్తున్నాయి. మెయిన్ రోడ్డులో డ్రెయినేజీ ఉన్నప్పటికీ ఇతర ప్రాంతాల్లో నీటిపారుదలకు తగిన ఏర్పాట్లు లేకపోవడంతో వర్షంనీటితో పలు నివాస ప్రాంతాలు జలదిగ్బంధంలో చిక్కుకుంటున్నాయి. నగర పంచాయతీ సాధారణ నిధులతో పట్టణ అభివృద్ధికి అవకాశం లేకపోవడంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి అదనపు గ్రాంట్ల కోసం ఎదురు చూడాల్సి వస్తోందని పాలకవర్గం చెబుతోంది.

రూ.100 కోట్లతో ప్రతిపాదనలు

తిరువూరు పట్టణంలోని అన్ని వార్డుల్లో విడతలవారీగా సిమెంటు రహదారులు నిర్మించిన అధికారులు పక్కా డ్రెయిన్ల నిర్మాణంపై దృష్టి సారించలేదు. ఆర్థిక సంఘ నిధులు, ఎస్సీ, ఎస్టీ ప్రాంతాల అభివృద్ధి నిధులు మంజూరైనప్పుడు హడావుడిగా సీసీ రహదారుల నిర్మాణం జరపడం మినహా ఎక్కడా డ్రెయినేజీలను నిర్మించలేదు. వర్షాకాలంలో శివారు ప్రాంతాలు, లోతట్టు ప్రాంతాల్లో నీరు పోయే మార్గం లేక రోజుల తరబడి ఇళ్లముందు నిలిచిపోవడంతో పాటు పలు నివాస గృహాల్లోకి కూడా వర్షం నీరు చేరి ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. రూ.100 కోట్లతో 2015లో తిరువూరు నగర పంచాయతీ నుంచి పక్కా డ్రెయినేజీల నిర్మాణానికి సమగ్ర ప్రణాళిక రూపొందించినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం నుంచి స్పందన లేదు. 15వ ఆర్థిక సంఘం నిధులతో అవసరమైన చోట్ల డ్రెయిన్ల నిర్మాణానికి నగర పంచాయతీ కౌన్సిల్ నిర్ణయించింది. త్వరితగతిన డ్రెయినేజీ సమస్య నివారించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.



రోడ్ల నిర్మాణంతోనే సరి

ప్రభుత్వం నుంచి వచ్చే గ్రాంట్లతో సీసీ రహదారుల నిర్మాణానికి ప్రాధాన్యత ఇస్తున్న నగర పంచాయతీ డ్రెయినేజీల నిర్మాణానికి పక్కా ప్రణాళిక రూపొందించకపోవడం విచారకరం. వర్షాకాలంలో ప్రజలు పడే ఇబ్బందులు చూసైనా పాలకవర్గం స్పందించాలి.

– ఎస్‌కే సుబానీ, తిరువూరు



ప్రత్యేక నిధులు మంజూరు చేయాలి

తిరువూరు నగర పంచాయతీకి వచ్చే ఆదాయంతో అభివృద్ధి చేసే అవకాశం లేనందున ప్రభుత్వం అదనపు గ్రాంట్లు మంజూరు చేయాలి. దీర్ఘకాలంగా తిరువూరు అభివృద్ధికి పాలకులు ఎటువంటి నిధులూ కేటాయించకపోవడంతో శివారు ప్రాంతాల్లో, లోతట్టు ప్రాంతాల్లో ప్రజలు సదుపాయాల లేమితో ఇబ్బంది పడుతున్నారు.

–బి. వెంకటేశ్వరరావు, తిరువూరు



రూ.140 కోట్లు అవసరం

తిరువూరు పట్టణంలో పక్కా డ్రెయినేజీ వ్యవస్థ ఏర్పాటుకు కనీసం రూ.140 కోట్లు అవసరం ఉంటుందని ఇంజినీరింగ్ అధికారులు అంచనా వేశారు. నగర పంచాయతీలో సాధారణ నిధులను కేటాయించేందుకు అవకాశం లేనందున కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ప్రత్యేక గ్రాంట్ల కోసం ప్రయత్నిస్తున్నాం. మధిర రోడ్డు విస్తరణలో భాగంగా ఆర్ అండ్ బీ అధికారులు డ్రెయినేజీతో పాటు రోడ్డు నిర్మాణానికి నిర్ణయించారు.

– లోవరాజు, నగర పంచాయతీ కమిషనర్, తిరువూరు

సామాజిక సంఘ సంస్కర్త పూలే

మాజీ ఎమ్మెల్యే మేకా ప్రతాప్ అప్పారావు



నూజివీడులో నివాళులర్పిస్తున్న ప్రతాప్ అప్పారావు, నాయకులు



తిరువూరులో నివాళులర్పిస్తున్న చైర్‌పర్సన్, కౌన్సిలర్లు, నాయకులు

నూజివీడు: మహాత్మా జ్యోతిరావు పూలే గొప్ప సంఘ సంస్కర్త అని మాజీ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. జ్యోతిరావు పూలే వర్ధంతిని స్థానిక వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయంలో గురువారం నిర్వహించారు. పూలే చిత్రపటానికి ప్రతాప్ అప్పారావు పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ పూలే గొప్ప సాంఘిక విప్లవవాది అని, జీవితాంతం ప్రజల సంక్షేమానికి పాటుపడిన సేవాతత్పరుడని అన్నారు. విద్యతోనే సమాజ అభివృద్ధి సాధ్యమని భావించి మహిళలు కూడా చదువుకోవాలని ప్రోత్సహించారని వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు శీలం రాము, నాయకులు పలగాని నరసింహారావు, షేక్ యూనస్ పాషా (గబ్బర్), షేక్ మస్తాన్, కైలే సురేష్, కౌన్సిలర్ ప్రదీప్, తదితరులు పాల్గొన్నారు.

బడుగు వర్గాల ఆశాజ్యోతి పూలే

తిరువూరు: బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి మహాత్మా జ్యోతిరావు పూలే ఎంతగానో కృషి చేశారని తిరువూరు నగర పంచాయతీ చైర్‌పర్సన్ గత్తం కస్తూరిబాయి అన్నారు. వైఎస్సార్ సీపీ తిరువూరు నియోజకవర్గ ఇన్‌చార్జి స్వామిదాసు నివాసం వద్ద గురువారం జ్యోతిరావు పూలే 134వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆమె మాట్లాడుతూ మహిళా విద్యకు, ఎస్సీ, ఎస్టీ, బీసీల అభ్యున్నతికి పూలే కృషి చేశారన్నారు. సామాజిక అసమానతల తొలగింపునకు పోరాడారని వివరించారు. వార్డు కౌన్సిలర్లు పరసా శ్రీనివాసరావు, మోదుగు ప్రసాద్, వైఎస్సార్ సీపీ నాయకులు కాలసాని విజయలక్ష్మి, గోపాల నాగేశ్వరరావు, తాళ్లూరి నవీన్, జాకీర్, గత్తం నాగేశ్వరరావు పాల్గొన్నారు.

- చాట్రాయి: చిన్నంపేట సిద్ధార్థ హైస్కూల్లో జ్యోతిరావు పూలే చిత్రపటానికి వ్యవసాయ కార్మిక మండల కార్యదర్శి కొమ్ము ఆనందం తదితరులు నివాళులర్పించారు. సామాజిక చైతన్య వేదిక మండల ఆర్గనైజర్ ఈవీ శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ పలగాని శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.
- పెనుగొలను(గంపలగూడెం): పెనుగొలను శివారు జింకలపాలెం ప్రాథమిక ఎలిమెంటరీ పాఠశాలలో గురువారం షిర్డీ సాయిబాబా సేవా కమిటీ ఆధ్వర్యంలో పూలే చిత్రపటానికి పలువురు పూలమాల వేసి నివాళులర్పించారు. వక్తలు మాట్లాడుతూ అంటరానితనం, కుల వ్యవస్థ నిర్మూలనతో పాటు, మహిళల విద్య కోసం విశేషమైన కృషి చేసిన జ్యోతిరావు పూలే గొప్ప మానవతావాది అని వివరించారు. ఉపాధ్యాయులు ఎస్‌కే షెహనాజ్ బేగం, కె. సురేష్, వై. శ్రీనివాసరావు, షిర్డీ సాయి బాబా సేవా కమిటీ సభ్యులు వి. వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.
- ఇబ్రహీంపట్నం: మహాత్మా జ్యోతిరావు పూలే వర్ధంతి కార్యక్రమం ఇబ్రహీంపట్నం ఎన్టీటీపీఎస్ వద్ద విద్యుత్ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గురువారం జరిగింది. ఎన్టీటీపీఎస్ చీఫ్ ఇంజినీర్ టి.నాగరాజు జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ పూలే ఉన్నతమైన ఆశయాలను గౌరవించి ఆచరించాలన్నారు. సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి ముప్పసాని రామకృష్ణ, సంఘం సభ్యులు నారాయణ రావు, పుల్లారావు, శ్రీనివాసరావు, శ్రీహరి, తదితరులు పాల్గొన్నారు.
- కొండపల్లి జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ముప్పసాని రామకృష్ణ నివాళులర్పించారు. జేవీవీ జిల్లా ఉపాధ్యక్షుడు పి.కామేశ్వరరావు, ఎస్.నాగరాజు, సర్దార్ సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.
- విస్సన్నపేట: స్థానిక రెడ్డిగూడెం రోడ్డులోని జ్యోతిరావు పూలే, సావిత్రిబాయిపూలే విగ్రహాల వద్ద జ్యోతిరావు పూలే వర్ధంతి కార్యక్రమం బహుజన దళిత ఐక్యవేదిక ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఐక్యవేదిక అధ్యక్షుడు ముత్తంశెట్టి శ్రీనివాసరావు, కమిటీ నాయకులు గొర్రె లాజరస్, ముంగా జయరాజు, పల్లెపాం లక్ష్మయ్య, కంకట మోహనరావు,కోపల్లి జయకర్, మేకల జ్ఞానరత్నం పాల్గొన్నారు.

వరికోతలను వాయిదా వేసుకోవాలి



ధాన్యం రాశులను పరిశీలిస్తున్న చాముండేశ్వరి

నూజివీడు: తుపాను హెచ్చరికల నేపథ్యంలో వరిసాగు చేసిన రైతులు అప్రమత్తతతో వరి కోతలను వాయిదా వేసుకోవాలని మండల వ్యవసాయాధికారి ఆలూరు చాముండేశ్వరి సూచించారు. పోతురెడ్డిపల్లి, ముక్కొల్లుపాడు, పడమర దిగవల్లిలలో కల్లాల్లో ఆరబెట్టిన ధాన్యం రాశులను వ్యవసాయాధికారి గురువారం పరిశీలించి మాట్లాడారు. రైతులకు పలు సూచనలు చేశారు. ధాన్యాన్ని త్వరితగతిన కొనుగోలు కేంద్రాలకు తరలించి విక్రయించుకోవాలన్నారు. మండలంలో ఖరీఫ్‌లో వరి పంట 2,876 ఎకరాల్లో రైతులు సాగు చేశారని, ఇప్పటివరకు కొనుగోలు కేంద్రాల ద్వారా 903 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామన్నారు. 151 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు పంపుతున్నామని చెప్పారు. రబీ సీజన్‌లో ఇప్పటివరకు మండలంలో 920 ఎకరాల్లో విత్తన మొక్కజొన్నను సాగు చేశారన్నారు. విత్తన మొక్కజొన్నను సాగు చేసిన రైతులు తప్పనిసరిగా కంపెనీతో ఒప్పందం కుదుర్చుకోవాలని రైతులకు విజ్ఞప్తి చేశారు.

త్వరితగతిన పూర్తిచేయాలి

చాట్రాయి: వాతావరణ పరిస్థితుల దృష్ట్యా వరి కోతలను త్వరితగతిన పూర్తిచేయాలని వ్యవసాయాధికారి బి.శివశంకర్ పేర్కొన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో రెండు, మూడు రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నందున కోతలు కోసి ధాన్యాన్ని సురక్షితంగా నిల్వ చేసుకోవాలని లేదా రైతుసేవా కేంద్రాల్లో విక్రయించాలని సూచించారు.

ఉపాధ్యాయులపై మానసిక ఒత్తిడి తగ్గించాలి: యూటీఎఫ్

ముసునూరు: ఉపాధ్యాయులపై సెలవులు పెట్టొద్దంటూ చేస్తున్న మానసిక ఒత్తిడిని తగ్గించాలని యూటీఎఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.పద్మకిశోర్, జి.రాంబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ మండలాన్ని యూనిట్‌గా తీసుకుని 10 శాతం మంది మాత్రమే సెలవులు ఉపయోగించుకోవాలని విద్యా శాఖ ఉన్నతాధికారులు మౌఖిక ఆదేశాలు జారీ చేయడంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. విలేకరుల సమావేశంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు రుద్రాభిషేకం

ముసునూరు: బలివే మహా క్షేత్రంలోని బలే రామలింగేశ్వరస్వామికి శుక్రవారం ఏకాదశ రుద్రాభిషేకం, లక్ష బిల్వార్చన నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ పామర్తి సీతారామయ్య గురువారం తెలిపారు. కార్తిక మాసం, మాస శివరాత్రి సందర్భంగా శుక్రవారం బలివేలో రామలింగేశ్వరస్వామికి ఏలూరు ఆర్య వైశ్య వర్తక సంఘ ప్రతినిధుల ఆధ్వర్యంలో వైదిక కార్యక్రమాలు జరుగుతాయన్నారు.

స్కూల్ లీడర్‌షిప్ శిక్షణ పరిశీలన



ఆగిరిపల్లి: తోటపల్లి హీల్ ప్యారడైజ్ పాఠశాలలో ప్రధానోపాధ్యాయులకు, మండల విద్యాశాఖాధికారులకు నిర్వహిస్తున్న స్కూల్ లీడర్ షిప్ శిక్షణ కార్యక్రమాన్ని గురువారం విద్యా శాఖ జోన్–2 రీజనల్ జాయింట్ డైరెక్టర్ జి.నాగమణి పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ ప్రధానోపాధ్యాయులు సాంకేతిక పరిజ్ఞానం ద్వారా నాయకత్వ పటిమను పెంపొందించుకోవాలన్నారు. విద్యార్థుల్లో నైతిక విలువలు పెంచాలని, విద్యార్థినులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించాలని చెప్పారు. సోషల్ మీడియా ప్రభావం విద్యార్థులపై పడకుండా నిరంతరం కౌన్సెలింగ్ ఇవ్వాలని ప్రధానోపాధ్యాయులకు సూచించారు.

హీల్ పాఠశాలకు రూ. లక్ష విరాళం

ఈ సందర్భంగా శిక్షణ పొందుతున్న ప్రతినిధుల తరఫున హీల్ పాఠశాలకు రూ.లక్ష విరాళాన్ని హీల్ వ్యవస్థాపక అధ్యక్షుడు కోనేరు సత్యప్రసాద్‌కు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి లక్ష్మమ్మ, రాష్ట్ర పరిశీలకురాలు శ్రీలత, ఏలూరు జిల్లా ఏఎంఓ రెడ్డి రామారావు, ఆగిరిపల్లి ఎంఈఓ ఆనంద్ కుమార్, హీల్ సంస్థ సీఈఓ అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

మామిడి మొక్కల ధ్వంసం హేయం

మాజీ ఎమ్మెల్యే మేకా ప్రతాప్ అప్పారావు



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు

ఆగిరిపల్లి: అడవి నెక్కలంలో మచ్చా హరిబాబుకు చెందిన మామిడి మొక్కలను, ఫెన్సింగ్‌ను ధ్వంసం చేయడం హేయమైన చర్య అని మాజీ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. ఘటనా స్థలాన్ని పరిశీలించి ఆయన మాట్లాడారు. తనకు సంబంధం లేని భూమిని ఆక్రమించుకోవాలని చూడటం, బెదిరింపులకు పాల్పడడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. రైతు హరిబాబు పేరు మీదుగా పట్టా పుస్తకం ఉన్నా ఆక్రమించుకోవాలని చూస్తున్నారని చెప్పారు. నిందితుడిపై ఈ నెల 11న నూజివీడు డీఎస్పీ కార్యాలయంలో కేసు పెట్టినా ఇప్పటి వరకు ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. ఈ ఘటనకు పాల్పడిన నిందితుడు నందు, పొక్లెయిన్ డ్రైవర్‌ను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పిన్నిబోయిన వీరబాబు, సర్పంచులు లింగవరపు రమేష్, వేము రాజు, జోల భూషణం, హనుమంతరావు, రామారావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

భూ ఆక్రమణ కోసమే..

అడవినెక్కలం గ్రామంలో వైఎస్సార్ సీపీ నాయకుడు మచ్చా హరిబాబుకు సర్వే నంబరు 43/2లో 2.93 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. 11 ఏళ్ల నుంచి సాగు చేస్తున్నాడు. గత కొన్నేళ్ల నుంచి పరిమి నందు అనే వ్యక్తి ఆ భూమిని ఆక్రమించుకునేందుకు అనేక విధాలుగా ప్రయత్నిస్తున్నాడు. ఈ నెల తొమ్మిదో తేదీ రాత్రి హరిబాబు పొలంలోకి అక్రమంగా ప్రవేశించి రెండేళ్ల కిందట నాటిన వంద మామిడి మొక్కలను, మామిడి తోట చుట్టూ వేసిన ఫెన్సింగ్‌ను జేసీబీతో ధ్వంసం చేశారు. ఈ ఘటనను పలువురు తీవ్రంగా ఖండించారు.

ప్రజాదరణ గల నేత చంటినాయన



చంటినాయనకు బొకే అందజేస్తున్న నాయకులు

నూజివీడు: ప్రజాదరణ గల యువ నేత చంటినాయన అని మాజీ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ యువ నాయకుడు మేకా నాగ వెంకట వేణుగోపాల అప్పారావు (చంటినాయన) జన్మదిన వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి పంచిపెట్టారు. నియోజకవర్గం నలుమూలల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు ద్వారకా ఎస్టేట్‌కు విచ్చేసి చంటినాయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఏపీ స్టేట్ కో–ఆపరేటివ్ యూనియన్ లిమిటెడ్ మాజీ చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి, జెడ్పీ వైస్ చైర్మన్ గుడిమళ్ల కృష్ణంరాజు, ముసునూరు జెడ్పీటీసీ వరికూటి ప్రతాప్, మున్సిపల్ చైర్‌పర్సన్ రామిశెట్టి త్రివేణీదుర్గ, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు శీలం రాము, మున్సిపల్ వైస్ చైర్మన్లు కొమ్ము వెంకటేశ్వరరావు, ఆగిరిపల్లి జెడ్పీటీసీ పిన్నిబోయిన వీరబాబు, ఎంపీపీ గోళ్ల అనూష, నాయకులు పగడాల సత్యనారాయణ, పిళ్లా చరణ్, పల్లే రవీంద్రరెడ్డి, కొండా వెంకట్రావు, మచ్చా హరిబాబు, పల్లగాని నరసింహారావు, అక్కినేని ప్రేమసాయి, బోయపాటి ప్రతాప్ తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

శోభనాచలుడికి ప్రత్యేక పూజలు

ఆగిరిపల్లి: వైఎస్సార్ సీపీ యువనేత మేకా నాగ వెంకట వేణుగోపాల అప్పారావు (చంటి నాయన) పుట్టిన రోజు వేడుకలను గురువారం ఆగిరిపల్లిలో ఘనంగా నిర్వహించారు. స్థానిక శ్రీ శోభనాచల వ్యాఘ్ర లక్ష్మీనరసింహస్వామి వారిని ఆయన దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు వేదాంతం శేషబాబు ప్రత్యేక పూజలు చేసి చంటి నాయనను శాలువాతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపి పుష్ప గుచ్ఛాలు అందజేశారు. జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ గుడిమళ్ల కృష్ణంరాజు, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి మచ్చా హరిబాబు, వైస్ ఎంపీపీ కొండ వరదల రమేష్, జెడ్పీటీసీ సభ్యుడు పిన్నిబోయిన వీరబాబు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

పోస్టాఫీసుల వద్ద పడిగాపులు



ఖాతా తెరిచేందుకు తిరువూరు పోస్టాఫీసుకు వచ్చిన మహిళలు

తిరువూరు: ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధి పొందేందుకు పోస్టల్ పేమెంట్ బ్యాంకుల్లో ఖాతా తెరవాలని ప్రచారం జరగడంతో తిరువూరు పట్టణ ప్రజలు పోస్టాఫీసు వద్ద క్యూ కడుతున్నారు. పోస్టల్ అధికారులు తమ పోస్టల్ పేమెంట్ బ్యాంకుల్లో ఖాతా ఉన్న వారికే ప్రభుత్వ పథకాల సొమ్ము జమ వుతుందని మైకు ద్వారా ప్రచారం చేయడంతో గతంలో బ్యాంకు ఖాతా కలిగినవారు సైతం పోస్టాఫీసులో కొత్త ఖాతా తెరిచేందుకు పరుగులు తీస్తున్నారు. ప్రభుత్వం వివిధ పథకాల కింద నగదు విడుదల చేస్తుందనే ఆశతో పాటు పోస్టాఫీసులో ఖాతా తెరవకపోతే ఆ నగదు జమ కాదనే భయంతో తిరువూరు సబ్ పోస్టాఫీసు వద్ద నిత్యం మహిళలు, వృద్ధులు, దివ్యాంగులు సైతం వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది. గంటల కొలదీ వేచి ఉండటంతో ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై పోస్టల్ అధికారులను సంప్రదించగా.. పోస్టల్ పేమెంట్ బ్యాంకులో ఖాతా తెరవడం ద్వారా పోస్టాఫీసులో రికరింగ్ డిపాజిట్ చేయాల్సిన ఖాతాదారులు తమ వద్దకు రాకుండా ఆన్‌లైన్‌లోనే జమ చేయవచ్చన్నారు. ప్రభుత్వ పథకాలకు, పోస్టల్ ఖాతాకు సంబంధం లేదని చెప్పారు. వదంతులను నమ్మవద్దని చెప్పారు.

త్వరితగతిన టిడ్కో ఇళ్లు అందజేయాలి

సీపీఐ నాయకుడు తూము కృష్ణయ్య



సమావేశంలో మాట్లాడుతున్న తూము కృష్ణయ్య

తిరువూరు: గత తెలుగుదేశం ప్రభుత్వం తిరువూరులో చేపట్టిన టిడ్కో ఇళ్ల నిర్మాణం పూర్తి చేయడంలో అధికారులు ఉదాసీన వైఖరి అవలంబిస్తున్నారని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తూము కృష్ణయ్య అన్నారు. సీపీఐ పట్టణ సర్వసభ్య సమావేశం గురువారం తిరువూరు సుంకర వీరభద్రరావు భవన్‌లో జరిగింది. ఆయన మాట్లాడుతూ 2015లో 1,570 టిడ్కో ఇళ్ల నిర్మాణం చేపట్టిన తెలుగుదేశం ప్రభుత్వం పూర్తి చేయలేదని, ఇటీవల ఎన్నికల్లో కూటమి మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు 100 రోజుల్లో టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు కేటాయిస్తామని చెప్పినా నెరవేరలేదన్నారు. లబ్ధిదారుల నుంచి డిపాజిట్లు వసూలు చేయడంతో పాటు బ్యాంకు రుణాలిప్పించిన అధికారులు ఆ ఇళ్లను పూర్తిచేయించడంలో తీవ్ర జాప్యం చేయడం తగదన్నారు. బ్యాంకర్లు రుణ బకాయిలు చెల్లించాలని లబ్ధిదారులను ఒత్తిడి చేస్తున్నందున ప్రభుత్వం తక్షణం స్పందించి ఇళ్ల నిర్మాణం పూర్తి చేసి లబ్ధిదారులకు అప్పగించాలని కృష్ణయ్య డిమాండ్ చేశారు. తిరువూరు పట్టణంలో తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని, పక్కా డ్రెయిన్లు నిర్మించాలని, కుక్కలు, ఆవులు, పందులు, కోతుల బెడద అరికట్టాలని నగర పంచాయతీని కోరుతూ తీర్మానించారు. సమావేశంలో నాయకులు నాగుల్ మీరా, మాలపాటి ఉదయ్, చిలుకూరి వెంకటేశ్వరరావు, సుబాని తదితరులు పాల్గొన్నారు.

సారా స్వాధీనం

ఆగిరిపల్లి: మండలంలో పలు గ్రామాల్లో సారా అమ్ముతున్న వారిపై ఎక్సైజ్ అధికారులు దాడి చేసి నాలుగు లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ సీఐ మస్తానయ్య ఆధ్వర్యంలో ఈదరకు చెందిన పల్లగాని భీమయ్య నుంచి రెండు లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. శోభనాపురంలో అక్రమంగా సారా అమ్ముతున్న వెంకటేశ్వరరావు నుంచి రెండు లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని వారిద్దరిపై కేసు నమోదు చేశారు. ఎక్సైజ్ ఎస్‌ఐ రాజేంద్రప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.